# సామాజిక సంక్షేమానికి భూరి విరాళం

జయప్రకాష్ నారాయణ్

Bhavishyat Bharatam 03-July 2006



వితరణకు కొత్త అర్థం చెప్పిన
వారెన్ బఫెట్, బిల్‌గేట్స్

ప్రపంచ దాతృత్వ చరిత్రలో చెప్పుకోదగిన రెండు సంఘటనలు ఇటీవల జరిగాయి. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన బిల్ గేట్స్ తన ఆస్తిలో సింహభాగాన్ని సేవా కార్యక్రమాలకోసం విరాళంగా ఇచ్చారు. సతీమణి మెలిండాతో కలిసి బిల్ గేట్స్ ఏర్పాటు చేసిన సేవా సంస్థకు అందులో అధికమొత్తం అందుతుంది. ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్య రంగాలకోసం 'గేట్స్ ఫౌండేషన్' ఇప్పటికే గణనీయమైన కృషి చేస్తోంది. నివారించదగిన వ్యాధులన్నింటినీ ప్రపంచం నుంచి తుడిచిపెట్టాలన్న సమున్నత లక్ష్యంతో గేట్స్ కృషిచేస్తున్నారు. కంపెనీ వ్యవహారాలనుంచి తప్పుకొని ఇక తన పూర్తి సమయాన్ని ఫౌండేషన్ కార్యక్రమాలకోసమే వెచ్చించాలని ఆయన నిర్ణయించారు. యాభయ్యోపడి తొలివత్సరాలలోనే గేట్స్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషం. అందుకు అనుగుణంగా తన తరవాత మైక్రోసాఫ్ట్ సంస్థకు వారసుడిగా సాఫ్ట్‌వేర్ రంగ మేధావి రే ఒజ్జీ పేరును ఆయన ప్రకటించారు. మరో రెండేళ్లలో ఆయన మైక్రోసాఫ్ట్ అధికార బాధ్యతలు చేపడతారు. ఎనభయ్యేళ్ల ముదిమి మీదపడినా ఇంకా సంపాదనమీద తగని మమకారం చూపించే వారికి మన దేశంలో కొదవలేదు. పాశ్చాత్య దేశాల్లో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలు ఇలాంటివారికి ఆశ్చర్యం కలిగిస్తాయి. యాభయ్యేళ్లకే వ్యాపార సామ్రాజ్య బాధ్యతలను వదలివేయడమన్నది ఒకపట్టాన వీరికి నమ్మ బుద్ధి కాదు.

*సంపద అంటే ఏమిటి?*

బిల్ గేట్స్ నిర్ణయం తరవాత ఓ వారం రోజులకే ప్రపంచంలోని ధనవంతుల జాబితాలో రెండో స్థానంలో ఉన్న వారెన్ బఫెట్ మరో గొప్ప ప్రకటన చేశారు. తన ఆస్తిలో 85 శాతం వాటాను సేవా సంస్థలకు విరాళంగా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో అధికమొత్తం 'గేట్స్ ఫౌండేషన్'కు వెళుతుంది. సేవా సంస్థల కోసం గేట్స్ 30 బిలియన్ డాలర్ల(135,000 కోట్ల రూపాయలు)ను కేటాయించారు. మరోవైపు బఫెట్ ఇచ్చిన మొత్తం 37 బిలియన్ డాలర్లు (166,500 కోట్ల రూపాయలు). ప్రజా శ్రేయంకోసం కేటాయించిన కళ్లుచెదిరే విరాళాలివి. తన ప్రమేయం బొత్తిగా లేని గేట్స్ ఫౌండేషన్‌ను విరాళానికి ఎంచుకోవడంలోనే బఫెట్ ప్రజా ప్రయోజన కాంక్ష వెల్లడవుతోంది. ఇలా సమాజశ్రేయం కోసం ఆస్తులను తృణప్రాయంగా త్యజిస్తున్న వారు మరెందరో ఉన్నారు. ఆధునిక చరిత్రలో అనేక సందర్భాల్లో ఎందరో సంపన్నులు ప్రజావసరాలకోసం తమ ఆస్తులను ఖర్చు చేసిన ఉదంతాలున్నాయి. విశ్వవిద్యాలయాలు, చర్చిలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, పార్కులు, గ్రంథాలయాలు, పరిశోధన కేంద్రాలు, మ్యూజియాలు, కళాకేంద్రాలు వంటివాటికి అమెరికాలో విరాళాలను కేటాయించే సంస్కృతి ఉంది. బాధ్యత తెలిసిన ఎందరో సంపన్నులు తమ దగ్గర పోగుబడిన డబ్బును సామాజిక ఆస్తిగానే పరిగణిస్తున్నారు. అందుకే సామాజిక కార్యక్రమాలకోసం వారు తమ డబ్బును ఖర్చు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు.

జీవితంపట్ల సరైన అవగాహన, సృజనాత్మకత ఉన్న వ్యక్తులకు ప్రచార పటాటోపాలు రుచించవు. వీరిలో డబ్బు సంపాదన ఆలోచనలతోపాటు ప్రజా శ్రేయో దృక్పథం, ఎదుటివ్యక్తులను గౌరవించే స్వభావం కలగలిసి ఉంటాయి. నిర్మాణాత్మక ఆలోచనలతో వీరు పురోగమిస్తుంటారు. తల్లిదండ్రులనుంచి తమకు ఆస్తులు సంక్ర మిస్తాయన్న ఆలోచన పిల్లల్లో బద్ధకాన్ని పెంచుతుంది. వారిలో పోటీతత్వాన్ని తగ్గిస్తుంది. పుట్టుక, కుటుంబ స్థాయి, ఆదాయాలకు అతీతంగా వ్యక్తులందరికీ వారివారి సామర్థ్యాలను ప్రదర్శించే అవకాశాలు లభించినప్పుడే దీర్ఘకాలంలో సమాజం బాగుపడుతుంది. అలాకాని పక్షంలో సమాజం వెనకబాటులోనే మిగిలిపోతుంది. దానికితోడు అసమాన అవకాశాలవల్ల సమాజంలో అసంతృప్తి, నేర స్వభావం, హింస పెచ్చుపెరిగిపోతాయి. వివేకవంతులు ఈ వాస్తవాన్ని గుర్తించగలరు. అందుకే వారు తమ వ్యక్తిగత లక్ష్యాలకు, సమాజశ్రేయానికి మధ్య అగాధం ఏర్పడకుండా జాగ్రత్తపడతారు.

మతం ఎప్పుడూ నైతిక నియమావళికి భాష్యం చెప్పేందుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. వ్యక్తుల ప్రవర్తనకు కొన్ని కచ్చితమైన నియమాలను ఏర్పరచింది. చాలా సందర్భాల్లో ఏది నైతికత, ఏది పాపం అనే విషయంలో గందరగోళం తలెత్తుతుంటుంది. కానీ సమాజ లక్ష్యాలతో వ్యక్తిగత ప్రయోజనాలను అనుసంధానించడంలోనే సిసలైన నైతికత దాగి ఉంది. మతం, న్యాయం ఏం చెప్పినా సరే- వ్యక్తిగత లాభాలకోసం సమాజానికి చేటు కలిగిస్తే అది అనైతికమే అవుతుంది. వ్యక్తిగత ప్రయోజనాలతోపాటు సమాజ హితమూ నిలిస్తే అది నైతికమ వుతుంది. సంపదను సృష్టించడమంటే కట్టలు కట్టలుగా డబ్బును కూడబెట్టుకోవడం కాదు. ప్రజలందరికీ అవ సరమైన వస్తు, సేవల సృష్టే అసలైన సంపద. అలాంటి సంపద వల్ల దాని సృష్టించేవారికి లాభం చేకూరు తుంది, మరోవంక వనరుల లభ్యత పెరిగి సమాజ ప్రయోజనమూ నెరవేరుతుంది. సంపాదనలో అధిక భాగం- ప్రజా జీవితాన్ని సుసంపన్నం చేసేందుకు, వ్యథార్తులకు సిసలైన అవకాశాలను కల్పించేందుకు ఉప యోగపడితే- అంతకుమించిన నైతిక, పవిత్ర కార్యం మరొకటి లేదు.

మన సమాజంలోనూ దాతృత్వ ధోరణికి ఎన్నెన్నో ఉదాహరణలున్నాయి. సాధారణ జీవనం గడపడం, ధనా ర్జనకు దూరంగా ఉండటం, దాతృత్వం వంటి వాటికి సంప్రదాయంగా మన సమాజంలో మంచి గౌరవం దక్కింది. కానీ మన సంస్కృతిలో దాతృత్వమంటే- పేదలకు ధన సాయం చేయడం లేదా దేవాలయాలకు, దైవ కార్యాలకు డబ్బును వెచ్చించడంగా మాత్రమే స్థిరపడిపోయింది. దాతృత్వానికి కొత్త అర్థం ఇవ్వాల్సిన అవ సరం ఇప్పుడు ఎంతైనా ఉంది. విద్య, ఆరోగ్యం, వృత్తి నైపుణ్యాలను మెరుగుపెట్టుకొనే అవకాశాల కల్పన వంటి నిర్మాణాత్మక అంశాలవైపు దాతృత్వ లక్ష్యాలను మళ్ళించాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే తీరైన వ్యవస్థ, సరైన న్యాయ విధానాలు అవసరం. మన పన్నుల చట్టాలు, న్యాయ వ్యవస్థ, రాజకీయాలు, ప్రభుత్వ సంస్థ లను నిర్మాణాత్మకంగా మార్చుకోవాలి. దాతృత్వానికి కొత్త రూపునిస్తూ... రాజకీయ, సామాజిక వ్యవస్థలను తీర్చిదిద్దుకొనే దిశగా దానిని మళ్ళించాలంటే అందుకోసం ఎంతో ప్రయత్నం చేయాల్సి ఉంటుంది.

ఉదాహరణకు లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయడం అమెరికాలో చాలా సులభం. వీటి ఏర్పా టుకు ప్రభుత్వం ఏర్పరచిన నిబంధనలు, నియమాలు అత్యంత సరళంగా ఉన్నాయి. వీటికి విరాళాలిచ్చే దాతలకు వారిచ్చిన మొత్తాలపై పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. అమెరికాకు అవతలి ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సైతం స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు. అలాంటి సంస్థలకు విరాళాలిచ్చేవారికి కూడా నూటికి నూరుశాతం పన్ను మినహాయింపు లభిస్తోంది. ఉదాహరణకు- బర్మాలో ప్రజాస్వామ్య పురోభివృద్ధికో, కాంబోడియాలోని అంగ్‌కర్‌వాట్‌లో దేవాలయాల పునరుద్ధరణకో, పాకి స్థాన్‌లో హరప్పా లిపిని అధ్యయనం చేసేందుకో లేదా ఇండియాలో పాఠశాలల నిర్మాణానికో అమెరికాలో

స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పన్ను మినహాయింపులు పొందడం చాలా సులభం. విధానాలపరంగా, న్యాయపరంగా అమెరికాలో నెలకొన్న ఈ వాతావరణం అక్కడ దాతృత్వ కార్యకలాపాలకు తంగా నిలుస్తోంది. ఓ మాదిరి సంపాదన ఉన్న మధ్యతరగతి కుటుంబాలు కూడా తమ ఆదాయంనుంచి పదిశాతాన్ని విరాళాల రూపంలో చెల్లిస్తున్నాయి. రోడ్లమీద వాహనాల రద్దీని నియంత్రించడం, పిల్లల ఆలనపాలన, వృద్ధుల సంరక్షణ, రోగగ్రస్థులను వైద్యాలయాల్లో చేర్పించడం, పేదవిద్యార్థులకు చదువు చెప్పడం వంటి కార్యక్రమాల కోసం అమెరికాలో చాలామంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ సమయాన్ని, డబ్బును వెచ్చిస్తుంటారు. ఆ విధంగా సమాజంకోసం డబ్బును, సమయాన్ని, శక్తిని ఖర్చు చేయడాన్ని అక్కడివారు గర్వకారణంగా భావిస్తారు. సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా చేసేందుకు యువకులకు మంచి ప్రోత్సాహం లభిస్తుంటుంది. సమాజ సేవలో పాల్గొన్నవారికి కళాశాల అడ్మిషన్లలో, మార్కులు ఇవ్వడంలో ప్రాధాన్యత ఉంటుంది. దాతృత్వం వెల్లివిరిసేందుకు, సమాజశ్రేయోభిలాషను పెంచేందుకు అనువుగా అక్కడి చట్టాలను, పన్నుల విధానాలను, విద్యను, సమాజాన్ని తీర్చిదిద్దారు.

*'వాతావరణం' మారాలి*

దాతృత్వ ధోరణిని ప్రోత్సహించేందుకు అనువైన కొన్ని రకాల పన్నుల చట్టాలు మనదేశంలోనూ ఉన్నాయి. కానీ చాలా రకాల విరాళాలకు సెక్షన్ 80-జి కింద 50 శాతం మాత్రమే పన్ను మినహాయింపు లభిస్తోంది. కొన్ని సంవత్సరాల కిందటి వరకూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇచ్చిన విరాళాలకు కూడా పన్నునుంచి యాభై శాతం మినహాయింపే లభించేది. రాజకీయ పార్టీల విరాళాలకు నూరు శాతం పన్ను మినహాయింపు ఉంది. 2003లో ఆ మేరకు చట్టానికి సవరణలు చేశారు. కానీ చాలా పార్టీలు అక్రమ మార్గాల్లో ఓట్లను కొనుగోలు చేసేందుకు, వివిధ రకాలుగా ప్రజలను మభ్యపెట్టేందుకు మాత్రమే ఈ డబ్బును ఉపయోగిస్తున్నాయి. ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఇచ్చే విరాళాలకు సరైన ప్రోత్సాహకాలు లేనికారణంగా- స్వచ్ఛంద సంస్థలనేకం ప్రభుత్వ గ్రాంట్లు, విదేశీ సాయంమీద ఆధారపడి నడుస్తున్నాయి. ప్రభుత్వ గ్రాంట్లను సక్రమంగా వినియోగించే పరిస్థితి మన దేశంలో లేదు. పెచ్చుమీరుతున్న అవినీతి కారణంగా అనేక సందర్భాల్లో డబ్బు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోంది. విదేశీ సాయంమీద మితిమీరి ఆధారపడితే దేశ గౌరవం దెబ్బతింటుంది. తద్వారా కొన్ని సందర్భాల్లో విదేశీ అజెండా ప్రకారమే పనులను చేపట్టాల్సి రావచ్చు. ఆ తరహా విదేశీ సాయంవల్ల జాతి భద్రత ప్రమాదంలో పడవచ్చు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న సేవా సంస్థలను అక్కడి ప్రభుత్వాలు మితిమీరి నియంత్రిస్తున్నాయి. రాజ్యాంగంలోని 19 (1) (సి) ప్రకారం లభించిన స్వేచ్ఛా సూత్రానికి ఇది విరుద్ధం.

సమాజహితంకోసం పనిచేసే వాతావరణాన్ని సృష్టించుకోవాల్సిన అవసరం మనపై ఎంతైనా ఉంది. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా- విరాళాలు తప్పనిసరి. ఇది జరగాలంటే ప్రజా సంబంధ కార్యక్రమాలకు ఇచ్చే అన్ని విరాళాలకు పూర్తి స్థాయిలో పన్ను మినహాయింపు ఇవ్వాలి. నిబంధనలను ఉల్లంఘించేవారికి గట్టి శిక్షలూ విధించాలి. అనవసరమైన ప్రభుత్వ నియంత్రణలను ఎత్తివేయాలి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వ సాయం, విదేశీ విరాళాల మీద అతిగా ఆధారపడే పరిస్థితి తగ్గాలి. సమాజాన్ని నిర్మాణాత్మకంగా నవీకరించే స్వయం సహాయ బృందాలు, దాతృత్వ సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలి. దీన్ని ఓ ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్ళాలి. బిల్ గేట్స్, వారెన్ బఫెట్ ల ఉదాహరణల నేపథ్యం- మన దేశంలోని పారిశ్రామికవేత్తలకూ స్ఫూర్తిగా నిలవాలి. సమాజక్షేమం కోసం పాటుపడేందుకు ఈ ఉదంతాలు

వారికి ప్రేరకంగా ఉపయోగపడాలి. వ్యక్తిగత ప్రయోజనాలకు, సామాజిక శ్రేయానికి మధ్య తేడాలను తగ్గించగలిగినప్పుడే భారతీయ సమాజం పురోగమిస్తుంది.